# 20 వ శతాబ్ది తెలుగు కథకులు
## డా. కేతు విశ్వనాథ రెడ్డి గారి
## ఆకాశవాణి ప్రసంగాలు



తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా 'కౌముది' పాఠకులకి

ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

### మన సంస్కార బలాన్ని పెంచిన కొడవటిగంటి కుటుంబరావు

### (1909 - 1980)



**సమాజ** చరిత్రలో సంభవించే కొత్త కొత్త సంఘటలనకూ, సన్నివేశాలకూ తెలుగు కథా రచయితలందరూ ప్రతి స్పందించారని చెప్పలేము. అట్లాగే, ఒక కొత్త రచనా సందర్భం అంటే సామాజిక సందర్భం ఏర్పడినపుడు, కథా సాహిత్యానికి కొత్త కొత్త పాఠక వర్గాలు రూపొందుతున్నప్పుడు భావాలూ, ఆలోచనలూ, భావుకత్వమూ వచన శైలీ మారతాయని గుర్తించిన కథా రచయితలు కూడా అరుదే. సమాజ చరిత్ర చలనాన్నీ, సందర్భాన్నీ, పాఠక వర్గాలనూ గుర్తించి, కథా సాహిత్యాన్ని సంస్కార ప్రేరక శక్తిగా, నిరంతరం సంస్కార పరిణామ సాధనంగా భావించిన రచయితలు మరీ అరుదు. అరుదైన రచయితల్లో రచయితలకూ, పాఠకులకూ మార్గదర్శకుడు కొడవటిగంటి కుటుంబరావు.

సాహిత్యానికి జీవితం ప్రమాణమని కుటుంబరావు విశ్వసించారు. అంటే ఆయన దృష్టిలో జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించాలే తప్ప, ఒక ఊహాలోక జగత్తునో, స్వప్న ప్రపంచాన్నో సృష్టించడం కాదని అర్థం. అయితే, జీవితం ప్రమాణమనే మాటకు కుటుంబరావు ఏ అర్థాన్ని ఉద్దేశించినట్లు? ఇది మనం ఆలోచించవలసిన విషయం.

రెండో ప్రపంచ యుద్ధం మొదలుకాక కొంచెం ముందో, ఆ యుద్ధకాలంలోనో అంటే 1938- 1942 మధ్య కాలంలో కుటుంబరావు 'పీడకథ' అని ఒక కథ రాశారు. పీడ కథలోని ప్రధాన పాత్ర సీతారామయ్య అనే ఒక సామాన్య వ్యక్తి. అనామకుడు "నవ్య సాహిత్య పరిషత్తు సభ్యత్వం కూడా ఎరగని ఓ కోన్ కిస్కాగాడు. నవ్య సాహిత్య పరిషత్తు కూడా శీతకన్నేసిన కథా సాహిత్యం మీద విప్లవం చేశాడు". ఈ కథలోని సీతారామయ్య కథా రచయిత కావాలనుకున్నాడూ ఇటాలియన్ నాటక కర్త పిరాండెలో 'సిక్స్ కారెక్టర్స్ ఇన్ సర్చ్ ఆఫ్ ద అథర్' నాటకంలో లాగా రకరకాల పాత్రలు అతని దగ్గరికి వస్తాయి. "ఒక ప్రణయ ఘట్టం రాసెయ్యవోయి - ఝూం సేపు తర్కించకా" అని ఒక పాత్ర వచ్చి అడుగుతుంది. "నీ ప్రణయంతో నీ సంస్కారానికీ, ఆస్తికీ, నీ ఉద్యోగానికీ ఏమీ

సంబంధం లేదా? ఏమిటి?" అని సీతారామయ్య ఆ పాత్రను ప్రశ్నిస్తాడు. ఈ పీడ కథలో ఒక్కసారిగా ఐదారుగురు స్త్రీ పురుషులు తోసుకుంటూ సీతారామయ్య గదిలోకి వస్తారు.

"మీరంతా ఎవరు?" అన్నాడు సీతారామయ్య.

"మేం యదార్ధవ్యక్తులం" అన్నాడు, వాళ్ళ ప్రతినిధి.

"అంటే - ఇటీవల బయలుదేరిన యదార్ధవాదంతో మీకేమన్నా సంబంధం ఉందా? ఎందుచేతనంటే ఈ యదార్ధవాదం నాకు స్పష్టంగా అర్ధం కాలేదింకా యదార్ధమనే వంక పెట్టి కొందరు వొఠ్ఠి పాడి నిజం - ఏ విధమైన ప్రయోజనం ఉండటానికి వీల్లేదని రాస్తున్నారు. ఉన్నదే రాయడానికి రాత ఎందుకు? రాయదల్చుకున్న తరువాత ఉన్నదాని మీద సంస్కారం అంటూ యాడవాలిగా. పోనీ యదార్ధ వాదం త్యజించుదామా అంటే భావకలుతో వేగలేకుండా ఉన్నాం. వాళ్ళు మబ్బుల్లో కూచుని జీవితం కేసి చూడకుండా ఉన్నారు" అంటాడు సీతారామయ్య.

సీతారామయ్య దృష్టిలో యదార్ధవాదం అనేది స్వభావ వాదం. ఇంగ్లీషులో naturalism అంటామే అది. ఒట్టి పొడి నిజం రాసే రచనా ధోరణి. సీతారామయ్యకు అది ఇష్టం లేదు. ఇప్పుడున్న సంస్కారం స్థానంలో కావలసిన మరో మంచి సంస్కారం ఏర్పరిచే రాతకావాలి. జీవితం కేసి చూడని రాతల వల్ల ప్రయోజనం లేదు. సీతారామయ్య మనసులో వాస్తవిక వాద భావాలున్నాయి. అమలులో ఉండే నీతి, న్యాయం, డబ్బు రాజకీయం, సంస్కృతి - మొత్తం జీవితాన్ని ఇరుకు చేసినప్పుడు, ఆ ఇరుకుకు కారణమైన జీవిత సమస్యలతో పోరాడగలిగిన శక్తినిచ్చే సంస్కారమూ దృష్టికావాలి. ఇది సీతారామయ్య ఆకాంక్ష. ఈ ఆకాంక్షే కుటుంబరావును కథా రచయితగా, నవలా కర్తగా, రూపక రచయితగా, వ్యాసరచయితగా, సాహిత్య విమర్శకుడిగా ఈ ఆకాంక్షనే ఆయన రచనాదర్శంగా పెట్టుకున్నారు.

కొడవటిగంటి కుటుంబరావు విరివిగా రచనలు చేశారు. 50 ఏళ్ళు నిర్విరామంగా రాశారు 400 లకు పైగా కథలు, వందదాకా గల్పికలు, 20కి పైగా నవలలు, నవలికలు, కొన్ని పదుల రేడియో నాటికలు, 500 దాకా సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక వ్యాసాలూ రాశారు. కొన్ని ఉత్తమ అనువాదాలను అందించారు. బాలల మనోవికాసానికి తోడ్పడే బాల సాహిత్యాభివృద్ధికి తోడ్పడ్డారు. కొన్ని సినిమాలకు కూడా పనిచేశారు. ఆధునిక రచన సాహిత్య రూపాలూ, ప్రక్రియలూ ఆయన చేతుల్లో కొత్త రూపును దిద్దుకున్నాయి. 1940 ప్రాంతాల్లో, గల్పిక అనే కొత్త సంక్షిప్త వ్యంగ్య రూపానికీ, ఆవిష్కర్త కుటుంబరావు. దినచర్య నవలకూ ఓనమాలు దిద్దింది ఆయన. కధానికా రచనలో ఆయన కొత్త ఒరవడిని సృష్టించారు. పైకి కనిపించే అర్ధంకాక, గూఢంగా రాజకీయాల మీద, నిశితమైన వ్యంగ్య విమర్శతో కూడిన మరొక అర్ధం స్ఫురించే గూఢార్ధ కథా శిల్పాన్ని పరిచయం చేశారు. మానవ చర్యల్నీ సామాజిక జీవితాన్నీ తలపింప చేసే జంతు కథలను రాశారు. ఐతిహాసాలూ, పురాణ కథలూ ఆయన చేతుల్లో కొత్త రూపునూ కొత్త భావాలనూ, కొత్త భాషనూ సంతరించుకునేలా కొత్త ధోరణి ప్రవేశపెట్టారు. శాస్త్ర విజ్ఞాన కల్పనలకు ఒక భూమికని ఏర్పరచారు. ఆలోచనా శక్తిని పెంపొందించే - భావుకత్వాన్ని గాఢతరం చేసే శైలి కుటుంబరావు కథా వస్తువులకూ, శిల్ప ప్రయోగాలకూ తోడు కావడం వల్ల ఒక నాగరిక శైలి అభివృద్ధి చెందింది.

కుటుంబరావు చేసిన అన్ని రకాల రచనల్లో పెద్ద పీట కథలదే. కథ ఆయన సాహిత్య హృదయానికి కేంద్రకం. శిల్ప పరిణితికి పరాకాష్ట. శిల్ప ప్రయోగాలకు సాధనం. ఆయన అచ్చయిన మొదటి కథ 1931 లో గృహలక్ష్మి పత్రికలో వచ్చింది. ఆ కథ పేరు 'ప్రాణాధికం.' ఈ కథ రాయడానికి ముందే చాలా కథలు రాసి, సంతృప్తి లేక నోటు పుస్తకాల్లోనే ఉంచినట్లు దాఖలాలున్నాయి. 'ప్రాణాధికం' కథలో కథాంశం - శకుంతల ప్రాణాధికమైన ప్రేమ. ఆ కాలంలో వస్తున్న కథలకు భిన్నంగా నడిచిన కథ అది. 1937 లో కుటుంబరావు మొదటి కథల సంపుటి 'కారుణ్యం' వచ్చింది. 1939 లో 'ఇల్లరికం' అనే మరొక కథల సంపుటి వచ్చింది. ఈ మొదటి

రచనల్ని మనం ప్రస్తావించుకోవడానికి కారణం: వాటిని విమర్శకులు పట్టించుకోవడం, విమర్శించడం. మొదటి కథల్లో ప్రచారం ఉందని పూండ్ల వెంకటరమణయ్య అన్నారు. చలం ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నట్లు సాక్షాత్తు శ్రీశ్రీ అన్నారు. కాల భైరవుడు అనే కథ అందంగా లేదని బుర్రా సుబ్రహ్మణ్యం అభిప్రాయ పడ్డారు. అయితే తొలి కథల్లోనే జీవిత విమర్శనూ, శిల్ప వైదుష్యాన్నీ, వాళ్ళు గుర్తించలేకపోయారు. తొలికథల్లో అమలులో ఉండే నీతి మీద, స్త్రీ పురుష సంబంధాల మీదా, మనస్తత్వాల మీదా విమర్శ ప్రధానంగా కల్పిస్తుంది. 1940 ప్రాంతాల్లో రాసిన 'తాతయ్య' కథ. 1945 లో రాసిన 'కులంగాడి అంత్యక్రియలు'. కుటుంబరావు రచనా విధానంలో మలుపులుగా భావించవచ్చు. అప్పటినుంచి మనస్తత్వాలనూ, సంస్కారాన్నీ ఆడించే సాంఘిక శక్తులను ఆయన కథల్లో చిత్రించారు. సమాజంలోని సకల భ్రమలనూ, వంచనలనూ, ఆత్మ ముగ్ధత్వాన్నీ కథల ద్వారా వెల్లడించి వాటిని ఎదుర్కోగల సంస్కార బలాన్ని అందించారు.

కుటుంబరావు కథల్లో వస్తువిస్తృతి ఉన్నతంగా వైవిధ్యం లేదని కొందరంటారు. ఆయనది వితంతు సాహిత్యం అనేదాకా వెళ్ళిన విమర్శకులు కూడా ఉన్నారు. కుటుంబరావు మధ్య తరగతి సమస్యల గురించి రాస్తూ ఆ తరగతి దౌర్భల్యాల క్షాళనం కోసం సాహిత్యకృషి చేశారు. దాదాపు వందేళ్ళ మధ్య తరగతి ఆర్థిక స్థితిగతుల్లో వచ్చిన పరిణామాలూ, సామాజిక రాజకీయ, సాంస్కృతిక జీవన చలనాలూ ఆయన కథలకు ముడి సరుకు. మధ్య తరగతిలో ఉండే వైవిధ్యమూ, వైరుధ్యాలూ ఆయన కథల్లో ఉన్నాయి. లేని వైవిధ్యం లేదు. ఆయన కుటుంబ సంబంధాలను చిత్రించారు. కుటుంబంలోని తండ్రీ, బిడ్డల సోదరీ సోదరుల భార్యాభర్తల సంబంధాలనూ, సమిష్టి కుటూంబంలోని పితృస్వామిక లక్షణాలనూ, బిడ్డల పెంపకాన్నీ, వితంతువులనూ, విధురుల సమస్యలనూ, యువతీ యువకుల ప్రేమలనూ, మోహాలనూ ఆపేక్షలనూ, వివాహ సమస్యలనూ, వైవాహిక, వైవాహికేతర బంధాలలోని అవినీతినీ, నీతినీ, రాజీనీ, ఘర్షణనూ, కుటుంబరావు కథాంశాలుగా స్వీకరించారు. వ్యక్తి కుటుంబం, వారసత్వం, సంస్కృతి, సంప్రదాయం, ఆర్థిక స్థితిగతులు - వీటి మధ్య ఉండే లంకెలను చిత్రించారు. వ్యక్తి వికాసానికీ, సంస్కారంతో కూడిన సామాజిక ఆరోగ్యానికీ, ఆపేక్ష అంటే ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవలసిన ప్రజాస్వామిక సంస్కారంతో కూడిన సామాజిక ప్రేమ మూలంగా ఉండాలనే జీవిత సత్యాన్ని కథల ద్వారా తెలిపారు. ఇటువంటి కథల్ని స్థూలంగా మనం సామాజిక కథలని అనవచ్చు. వీటిలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలు ప్రధానం.

ఉదాహరణకు 'చెడిపోయిన మనిషి' అనే కథను తీసుకుందాం. ఈ కథలోని ఒక తండ్రి కూతురి ప్రవర్తన బాధించడం వల్ల ఇంట్లోంచీ పారిపోతాడు. కష్టంలో ఉన్న అతన్ని ఒక డాక్టరు చేరదీస్తుంది. ఆమె పెళ్ళికాకుండా మరొక వ్యక్తితో ఏర్పరచుకున్న బంధాన్ని ఆ తండ్రి గమనిస్తాడు. తండ్రి కథ విన్న డాక్టరు అంటుంది: "మనిషికి సాధ్యమైనంత హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్టు చూసుకోవడమే సరి అయిన ప్రవర్తన. మిగిలిన బూటకపు నీతి నియమాలను నమ్మకండి" అంటుంది. నీతి నియమాల సరిహద్దులను యాంత్రికంగా నిర్ణయించడం సమాజానికి మంచిది కాదనే అంశం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

స్త్రీ సౌందర్య సమస్యను చిత్రించిన పెద్ద కథ 'కురూపి'. "సామాజిక జీవితం భౌతికంగా సుప్రతిష్ఠితమయ్యే కొద్దీ మానవుని ఆధ్యాత్మిక శక్తులు పెరిగి తీరుతాయి. మనిషి నుంచి మనిషి పొందే లక్షలాది అనుభూతులను అందం ఇచ్చేది ఒకటి మాత్రమే. అంతకంటే గాఢమైన అనుభూతులు చాలా ఉంటాయి" అనే జీవిత సత్యం కురూపి కథలోని సరస్వతి పాత్రచిత్రణ ద్వార మనకు తెలుస్తుంది.

కుటుంబరావు గూఢార్థ కథా శిల్పాన్ని పరిచయం చేశాడని ముందు అనుకున్నాం. దేశకాలాల్ని తిరగదిప్పి, తాత్విక దృష్టితో తీవ్రమైన వ్యంగ్య కంఠస్వరంలో కుటుంబరావు రాసిన కథలు దిబ్బ కథలు. ఈ కథల్లోని రాజ్యం పైకి కనిపించే ఒక దిబ్బరాజు రాజ్యం మనకు తట్టే రాజ్యం మనదే మన రాజ్యంలోని అవకతవకలే.

కుటుంబరావు రాసిన జంతు కథ 'పట్నవాసం'. ఇది ఒక ఎలుకల కథ. ఈ కథద్వారా నగరాల్లోని అమానుషం, పరస్పర వంచన, దోపిడీ, ఆత్మవంచన తెలిసి వస్తాయి.

కుటుంబరావు రాసిన కథల్లో 'బకాసుర' మనం ప్రస్తావించుకో తగింది. ఏకచక్రపుర భారత గాధ కుటుంబరావు చేతిలో ఒక కొత్త అర్థాన్ని సంతరించుకుంది. బకాసురలోని బకాసురుడు వయసు ఉడిగి చత్వారంలో ఉండే దుర్బలుడైన ప్రజా కంటకుడు. ప్రజలు దాన్ని గుర్తించినపుడు భయం తొలిగిపోతుంది అనే సత్యాన్ని కథ వెల్లడిస్తుంది. 'అమోఘవచనం' అనే కథ ఆధునిక కథా రూపాన్ని సంతరించుకున్న పురాణ గాధ. బ్రహ్మసరస్వతుల వాగ్వివాదం కారనంగా ఒక శివన్నకు వాక్శక్తి లభిస్తుంది. అమాయకుల జీవితాలు దెబ్బతింటాయి. దేవత్వం ఆఖరకు మొహం మెత్తుతుంది.

కేరికేచర్ పాత్ర సృష్టికి కుటుంబరావు సృష్టించిన సీతప్ప ఒక దృష్టాంతం. మధ్య తరగతిలోని నిత్య భయాందోళనలకూ, సందేహాలకూ తప్ప ఒక సంకేతం. కుటుంబరావు రాసిన కేయాస్ కథలు, డిటెక్టివ్ సాహిత్యాన్ని వ్యంగ్యంగా విమర్శించిన కథలు.

కుటుంబరావు రాసిన శాస్త్ర విభజన కల్పనలు అంటే సైన్స్ ఫిక్షన్ సామాజిక వ్యవస్థ స్వరూప స్వభావాలను చిత్రించినవి, 'చంద్రగ్రహణంలో', 'గ్రహాంతర యాత్ర,' 'గంధర్వలోక యాత్ర' కథలను వీటికి ఉదాహరణగా మనం చెప్పుకోవచ్చు. ఈ కథల్లో ప్రధానంగా మానవ విలువల విమర్శా, ఆ విలువలను ధ్వంసం చేయగల దారి తప్పిన శాస్త్ర విజ్ఞానం విమర్శ కనిపిస్తాయి. అలాగే ఆయన కాలాన్ని వస్తువుగా తీసుకుని 'ఫోర్త్ డైమన్షన్' ఒక అపురూప కథను రాశారు.

కథా శిల్పం గోప్యంగా ఉండాలని భావించి, సాధన ద్వారా ఒక అదృశ్య శిల్పాన్ని సాధించిన రచయిత కుటుంబరావు. కుటుంబరావు కథలను చదవడం ఒక నాగరికమైన అనుభవం. ఈ అనుభవం మన ఆలోచనా శక్తిని పెంచుతుంది. భావుకత్వాన్ని, నిశితం చేస్తుంది. మానవ విలువల్ని గౌరవించే సంస్కారం ఇస్తుంది. ఆయన భారతీయ సాహిత్య నిర్మాతల్లో నిస్సందేహంగా ముందువరసలో ఉండే రచయిత.